సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కొమ్మాది చెరువుకు మహర్దశ



అభివృద్ధి చేయనున్న కొమ్మాది చెరువు

కొమ్మాది: కొమ్మాది చెరువుకు మహర్దశ పట్టనుంది. జీవీఎంసీ 6వ వార్డు పరిధిలోని కొమ్మాది ప్రజల చిరకాల కోరిక మేరకు ఇక్కడి చెరువును అభివృద్ధి చేసేందుకు స్థానిక కార్పొరేటర్ ముత్తంశెట్టి లక్ష్మీ ప్రియాంక చొరవ చూపించారు. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో చెరువు చుట్టూ అభివృద్ధి చేసి, పూల మొక్కలు నాటి, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. త్వరలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించనున్నట్లు కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక తెలిపారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఈఓగా అట్టాడ జయప్రద



భీమునిపట్నం: భీమిలి ఎంఈవో – 2గా అట్టాడ జయప్రద బాధ్యతలు స్వీకరించారు. ఈమె పాయికరావుపేట నుంచి ఇక్కడకు బదిలీకాగా... ఇక్కడ విధులు నిర్వహించిన ఎంఈవో బాలామణి సీతమ్మధారకు బదిలీ అయ్యారు.

పాఠశాల మరమ్మతులకు రూ.2 లక్షలు



గొల్లలపాలెం పాఠశాల సమీపంలో పరిశీలిస్తున్న ఎంపీపీ రాంబాబు, తదితరులు

పద్మనాభం: 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు అనంతవరం పంచాయతీ గొల్లలపాలెం ప్రాథమిక పాఠశాల, మరుగుదొడ్డి మరమ్మతులకు మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఇటీవల ఈ గ్రామంలో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు దృష్టికి పాఠశాల దుస్థితిని స్థానిక యువకులు తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచనల మేరకు ఎంపీపీ రాంబాబు మంగళవారం గొల్లపాలెం ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ మేరకు పాఠశాల, మరుగుదొడ్డి మరమ్మతులకు రూ. 2 లక్షలు మంజూరు చేశారు. నెల రోజుల్లోగా మరమ్మతులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కె.సత్యనారాయణ, శివ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన గంగరాజు

ఆనందపురం : ఆనందపురం మండలం రెండో విద్యాధికారిగా కె.గంగరాజు నియమితులయ్యారు. ఆయన చీడికాడ మండలంలో ఎంఈవోగా పని చేస్తుండగా ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు మంగళవారం విద్యావనరుల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గంగరాజు మాట్లాడుతూ పాఠశాలల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మంచి ఫలితాల సాధనకు కృషి చేస్తానని చెప్పారు. ఆయనను ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్, జిల్లా కార్యదర్శి ఉప్పాడ రాము తదితరులు అభినందించారు.

'విద్యుత్ బిల్లుల భారం తగ్గించాలి'

తగరపువలస: ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించాలని చిట్టివలస సిటు నాయకులు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనలు వెనక్కు తీసుకోవాలని కోరారు. అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ రూరల్ ఏఈఈ జాగరపు రాముకు వినతిపత్రం అందించారు. నీలాతి రాము, పల్ల పెంటరాజు, జి.అప్పారావు, జోగ వెంకటరావు, రీసు చిన్నారావు, జి.అప్పన్న, బోని అప్పారావు పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9666125299, 9912440606

ఇష్టారాజ్యంగా పాలిథిన్ వినియోగం



పాలిథిన్ సంచులు వినియోగిస్తున్న దుకాణంలో చేపలపై ఫినాయిల్ వేస్తున్న శానిటేషన్ సిబ్బంది



మార్కెట్‌లో చికెన్ దుకాణం నుంచి పాలిథిన్ కవర్లు స్వాధీనం చేసుకుంటున్న జీవీఎంసీ అధికారులు

- ప్రైవేట్ మార్కెట్‌లో కానరాని నిషేధం
- స్వేచ్ఛగా వాడేస్తున్న వ్యాపారులు, వినియోగదారులు

తగరపువలస: పాలిథిన్ కవర్లు, వస్తువుల నిషేధంపై జీవీఎంసీకి సవాల్ విసురుతున్నారు స్థానిక ప్రైవేట్ మార్కెట్‌లోని వ్యాపారులు, వినియోగదారులు. నిత్యం వార్డు సచివాలయాల శానిటేషన్ కార్యదర్శులు, సిబ్బంది పాలిథిన్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగిస్తున్నా ఎవరూ చెవికి ఎక్కించుకోవడం లేదు. మంగళవారం ప్రైవేట్ మార్కెట్‌లో అధికారులు తనిఖీలు నిర్వహించగా చేపలు, రొయ్యలు, చికెన్, కూరగాయల విక్రయదారుల వద్ద గుట్టలు గుట్టలుగా పాలిథిన్ సంచులు బయటపడ్డాయి. దీంతో పాలిథిన్ సంచులు వినియోగిస్తున్న వ్యాపారుల చేపలపై ఫినాయిల్ చల్లి, చికెన్, కూరగాయల వ్యాపారులకు జరిమానా వడ్డించారు. కొనుగోలు చేసి పాలిథిన్ సంచులతో సరకులు ఇంటికి తీసుకెళ్తున్న వినియోగదారుల నుంచి చేపలు, కూరగాయలు స్వాధీనం చేసుకున్నారు. జీవీఎంసీ భీమిలి జోన్ పరిధి శివారులోని నాలుగు వైపులా నిత్యం నిఘా పెడుతున్నా తగరపువలస ప్రైవేట్ మార్కెట్, చుట్టుపక్కల దుకాణాలు, హోటళ్లు, తోపుడు బండ్ల వర్తకులు, చిరు వ్యాపారుల వద్ద రోజూ గుట్టలుగా పాలిథిన్ కవర్లు ప్రత్యక్షమవుతూనే ఉన్నాయి.

హోల్‌సేల్ వ్యాపారుల అండతోనే..!

తగరపువలస పరిధిలోని హోల్‌సేల్ వ్యాపారులు నిషేధిత వస్తువుల సరఫరా పైనే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. భీమిలి పరిసరాలను ఆనుకుని ఉన్న పద్మనాభం, భోగాపురం, డెంకాడ, ఆనందపురం మండలాల్లోని గొడౌన్‌లలో నిషేధిత వస్తువులైన గుట్కా, పాలిథిన్ సంచులు, వస్తువులను పెద్ద ఎత్తున నిల్వ చేసి... మిగిలిన తినుబండారాలతో కలిపి చిల్లర వ్యాపారులు, పాన్‌షాపులకు విక్రయిస్తున్నారు. పాలిథిన్ సంచుల విక్రయాలపైనే ఎక్కువ లాభాలు లభిస్తుండటంతో హోల్‌సేల్ వ్యాపారులు వీటిని ప్రోత్సహించి కాగితపు, నార సంచులను దాచి పెడుతున్నారు. దీంతో జీవీఎంసీ అధికారులు ఎన్నిసార్లు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినా, నిఘా పెట్టినా ప్రతి వ్యాపారస్తుని వద్ద ఎక్కువ మొత్తంలో పాలిథిన్ సంచులు నిల్వ ఉంటున్నాయి. వీటిని అరికట్టడం ఎలాగని జీవీఎంసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తగరపువలస కేంద్రంగా 60 మంది వరకు హోల్‌సేల్ వ్యాపారస్తులు ఉన్నారు. వీరికి చెందిన దుకాణాలు, గొడౌన్లను తనిఖీ చేసినట్టయితే పాలిథిన్‌కు అడ్డుకట్ట వేయవచ్చని భావిస్తున్నారు. అంతేకాకుండా వారికి అధిక మొత్తంలో జరిమానా విధించి, ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేస్తే తప్ప పాలిథిన్ నిషేధం పూర్తిగా సాధ్యం కాదంటున్నారు. అలాగే చిన్న దుకాణాల్లో సైతం నిత్యం తనిఖీలకు సిబ్బందిని కేటాయించి పూర్తిగా పాలిథిన్ వినియోగాన్ని నిషేధించకపోతే రానున్న వర్షాకాలంలో వీటి కారణంగా డ్రైనేజీల్లో వర్షపు నీరు, మురుగునీరు పారుదలకు ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు.



పాలిథిన్ కవర్‌లో రొయ్యలు వేస్తున్న విక్రయదారు



పాలిథిన్ కవర్‌తో వినియోగదారుడు

పశు బీమాతో రైతులకు మేలు



ఆవుని పరిశీలించి బీమా చేస్తున్న డీడీ కరుణాకర రావు

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతున్న వైఎస్సార్ పశు బీమా పథకం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.కరుణాకరరావు చెప్పారు. మండలంలోని చందకలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయం సమకూర్చే పశువులు మరణించినప్పుడు బీమా పథకం ద్వారా లభించే పరిహారం రైతులను ఆదుకుంటుందన్నారు. పాడి పశువులు, గొర్రెలు, మేకల పెంపకం ద్వారా వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని, అటువంటివి ప్రమాదవశాత్తు మరణిస్తే పశు పోషకులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వైఎస్సార్ పశు బీమా ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా 12 పశువులకు బీమా చేశారు. కార్యక్రమంలో ఏడీలు ఎస్.శ్రీనివాసరావు, ఎం.ప్రసాదరావు, ఎల్.కన్నయ్యనాయుడు, ఆనందపురం పశు వైద్యాధికారి ఎస్.లీలారాణి, బీమా అధికారి సత్యకిషోర్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితునికి అండగా పూర్వ విద్యార్థులు



అప్పలరెడ్డికి సాయం అందిస్తున్న స్నేహితులు

తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 1995 – 96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తమ స్నేహితుడు సరగడ అప్పలరెడ్డికి మంగళవారం రూ.41 వేల నగదు, నిత్యావసర సరకులు అందించారు. అస్వస్థత కారణంగా గుడివాడలో ఇంటి వద్దే ఉంటున్న అప్పలరెడ్డిని కలిసి ఆరోగ్యం గురించి ఆరా తీసి ధైర్యం చెప్పారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అప్పలరెడ్డిని ఎర్నింటి కృష్ణ, కందివలస దుర్గాప్రసాద్, చొప్పా శ్రీను, సూరిబాబు, కెల్ల శ్రీను, సూర్య వెంకటరావు, బాసాన శ్రీను, ఏలూరు రాంబాబు తదితరులు పరామర్శించారు.

ఆహార ప్యాకెట్లు పంపిణీ



ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ చిరంజీవి, తదితరులు

తగరపువలస: భీమిలి టీచర్స్ హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం తగరపువలసలో పలుచోట్ల అన్నార్తులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. గణేష్ థియేటర్ కూడలి వద్ద భీమిలి ట్రాఫిక్ ఎస్‌ఐ చింతలపూడి చిరంజీవి పాల్గొని ఉపాధ్యాయుల సేవా కార్యక్రమాన్ని కొనియాడారు. కార్యక్రమంలో గ్రూప్ ప్రతినిధులు కె.ముత్యాలరావు, ఎం.రామకృష్ణ, పత్రి సన్యాసిరావు, గౌతం సాయి తదితరులు పాల్గొన్నారు.

రోజులు గడుస్తున్నా.. కేసు నమోదు చేయరే..!

నిర్లక్ష్యంగా భీమిలి పోలీసుల తీరు



వలందపేటలో వేడినీళ్లు పోయడంతో తీవ్రంగా గాయపడిన ఎర్రమ్మతో కుటుంబ సభ్యులు

తగరపువలస: భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితులకు సకాలంలో న్యాయం జరగకపోవడంతో మధురవాడ ఏసీపీ, నగరంలోని పోలీస్ కమిషనర్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ఫిర్యాదులు పట్టుకుని తిరుగుతున్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'ను నగర పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ల కంటే భీమిలి స్టేషన్ పరిధి నుంచే ఎక్కువ మంది బాధితులు ఆశ్రయించినట్టు తెలిసింది. సమస్యల పరిష్కారంలో ఇక్కడి సిబ్బంది నెలల కొద్దీ తాత్సారం చేస్తుండటంతో బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగలేక ఊరుకుంటున్నారు. ఒక్కోసారి బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు కూడా ఇక్కడి స్టేషన్ నుంచి మాయం అవుతున్నాయి. దీంతో చాలా వరకు కేసులు వెలుగు చూడకుండానే అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి.

- ఈ నెల 15న జీవీఎంసీ రెండో వార్డు వలందపేటలో కోనాడ ఎర్రమ్మ అనే మహిళకు పొరిగింటి సభ్యులతో వివాదం జరగ్గా... బాధితురాలు వెంటనే భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో 17న పొరిగింటి కుటుంబ సభ్యులు ఇద్దరు ఎర్రమ్మపై వేడి నీళ్లు పోయగా 30 శాతం కాలిన గాయాలతో ఆమె నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అయినప్పటికీ నాలుగు రోజులు గడచినా ఇప్పటి వరకు పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో బాధితులు మధురవాడ ఏసీపీ కార్యాలయాన్ని ఆశ్రయించారు.
- ఈ ఏడాది ఫిబ్రవరి 28న సంతపేటకు చెందిన కాకి ఎల్లాజీ, కాకి సన్యాసిరెడ్డి అనే ఇద్దరు అన్నదమ్ములను భీమిలి ప్రాంతానికే చెందిన రౌడీషీటర్ రక్తమోడేలా చావబాదినా పోలీసులు బాధితులపై కనికరం చూపలేదు. నెల రోజులు తిప్పించుకున్నాక ఫిర్యాదు లెటర్ పోయిందని, సదరు రౌడీషీటర్‌తో రాజీ చేసుకోవాలని హితవు పలికారు. ఇవే కాకుండా గ్రామాల్లో జరుగుతున్న పలు కేసులు బయటకు రాకుండానే ముగిసిపోతున్నాయి. ఇక్కడి సీఐ కె.లక్ష్మణమూర్తి సౌమ్యుడు కావడంతో దిగువ స్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి భీమిలి పోలీస్ స్టేషన్‌ను ప్రక్షాళన చేసి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

కొత్తమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణ



మల్లె, తులసి మాలలతో అలంకరించిన కొత్తమ్మతల్లి విగ్రహం

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట తదితర గ్రామాల దేవత కొత్తమ్మ తల్లిని మంగళవారం మల్లె, తులసి మాలలతో అలంకరించారు. ఈ అలంకరణతో భక్తులకు దర్శనాలు కల్పించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో అలంకరణకు దాతలు కొత్తపేటకు చెందిన ఎర్నింటి వెంకటరమణ, ఆదర్శనగర్‌కు చెందిన చేట్ల అప్పయ్యమ్మ ఆర్థిక సహకారం అందించారు. భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లి ఆలయం, భవాని పీఠాలకు చెందిన సాడి కుమార్, వెంపాడ రామిరెడ్డి అమ్మవారిని అలంకరించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ మధురవాడ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు మధురవాడ మెయిన్ రోడ్డు, భగవాన్ దాస్ కాలనీ, ఎంఎస్‌ఆర్ లే అవుట్, చంద్రంపాలెం, భాస్కరనగర్, సంపత్‌నగర్, ఉజ్వల హాస్పిటల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

ఘనంగా అమ్మవార్ల పండగ

పద్మనాభం: మండలంలోని కురపల్లిలో ఇద్దరు అమ్మవార్ల ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామంలో కొలువై ఉన్న నల్ల మారమ్మ, దుర్గాలమ్మ పండగను ప్రజలు జరుపుకున్నారు. నల్ల మారమ్మకు కురపల్లి, పాండ్రంగి గ్రామాల భక్తులు, దుర్గాలమ్మకు కృష్ణాపురం గ్రామానికి చెందిన మొకర, సుంకర, మువ్వ కుటుంబ సభ్యులు పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



సన్యాసిరావును సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: విధుల పట్ల అంకిత భావంతో పని చేసిన వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. మండలంలోని పాండ్రంగి ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సారిక ఆదినారాయణ, కోల సన్యాసిరావు, ఎం.వి.ఎస్.రెడ్డిలను మంగళవారం ఆయన సన్మానించారు. పదో తరగతిలో ప్రతిభ చూపిన హైస్కూలు విద్యార్థులు ఎం.గీతాంజలి, ఎం.శ్రీరామ్, వి.లక్ష్మిలను సన్మానించి మెమెంటోలు అందజేశారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. పాండ్రంగి పీఏసీఎస్ అధ్యక్షుడు అముజూరి అప్పారావు, ఎంఈవో ఎం.శివరాణి, ఎంపీటీసీ సభ్యురాలు పిన్నింటి నారాయణమ్మ, హైస్కూల్ హెచ్‌ఎం రాచకొండ వెంకట గిరి పాల్గొన్నారు.

హైవే డ్రైనేజీల్లో పూడిక తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



పొక్లెయిన్‌తో పూడిక తొలగిస్తున్న సిబ్బంది

తగరపువలస: మూడేళ్ల క్రితం హైవే డ్రైనేజీలు నిర్మించినప్పుడు నిర్మాణ సమయంలో కాలువలో ఉండిపోయిన ఫ్లై యాష్‌ను తొలగించకుండానే వాటిపై పొడవైన శ్లాబులు వేశారు. అప్పటి నుంచి ఈ డ్రెయిన్లలో మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా మారి సర్వీస్ రోడ్ల పైనుంచి ప్రవహిస్తూ వస్తుంది. దీనిపై 'హైవే డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడిక' శీర్షికతో ఈ నెల 9న సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన హైవే ఇంజినీరింగ్ సిబ్బంది మంగళవారం జేసీబీ, ట్రాక్టర్, క్రేన్ సాయంతో డ్రైనేజీపై పొడవాటి పలకలను తొలగించి... పేరుకుపోయిన ఫ్లై యాష్‌ను తొలగించారు. ఈ పూడిక తొలగింపు పనులు పాక్షికంగా కాకుండా బంగ్లామెట్ట నుంచి వలందపేట వరకు రహదారికి ఇరువైపులా పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శోభాయమానంగా జగన్నాథ స్వామి రథయాత్ర



ప్రత్యేక అలంకరణలో జగన్నాథస్వామి



జగన్నాథుని రథం లాగుతున్న భక్తులు

భీమునిపట్నం: స్థానిక శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో మంగళవారం రథయాత్ర శోభాయమానంగా సాగింది. ముందుగా బలరామ, సుభద్ర సహిత శ్రీ జగన్నాథస్వామికి కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీ జగన్నాథ స్వామి తొలి రథయాత్ర భీమిలి పురవీధుల్లో అత్యంత వైభవంగా సాగింది. ఈ యాత్రలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో శ్రీ బలభద్ర, సుభద్ర జగన్నాథ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవాల సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, వివిధ వర్ణాల పూలతో అభిషేకించారు. అనంతరం రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. హరే కృష్ణ, హరే రామ నామ సంకీర్తనలు ఆలపించారు.

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మేలు



శిబిరంలో రోగికి కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఆనందపురం : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని డీసీఎంఎస్ డైరెక్టర్, ఆనందపురం సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు అన్నారు. మండలంలోని నేల్తేరులో శ్రీసత్య సాయి సేవా సంస్థల విశాఖ జిల్లా జోన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన పాండ్రంకి అప్పారావు మాట్లాడుతూ గ్రామీణ యువత సమాజ సేవలో ముందుండాలని సూచించారు. విశాఖ కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 40 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో ఆరుగురికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి ఉచితంగా చేయడానికి నిర్ణయించారు. మిగతా వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో సేవా సంస్థల జిల్లా జోన్ కో – ఆర్డినేటర్ ఎం.వి.సత్యసాయి కుమార్, గొట్టిపల్లి భజన మండలి కన్వీనర్ కోరాడ తమ్మునాయుడు, కంటి ఆస్పత్రి కో – ఆర్డినేటర్లు బి.శ్రీనివాసరావు, కె.సంతోష్, సేవకులు కొట్యాడ లక్ష్మణమూర్తి, ఇ.సాయికృష్ణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ నరసింగరావు

తగరపువలస: ఇటీవల విడుదలైన ఆంధ్ర విశ్వవిద్యాలయం మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో చిట్టివలస శ్రీకృష్ణ డిగ్రీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పది పాయింట్లకు ఆళ్ల హరిత 9.52, ఎం.లోహిత 9.32, ఉషారాణి 9.30, కుసుమ 9.26, గాయిత్రి 9.22, మౌనిక 9.11, రోహిణి 9.04, వర్షిణి, శైలజలు 9, దేవి 8.38 సాధించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను శ్రీకృష్ణా విద్యా సంస్థల కరస్పాండెంట్ బి.నరసింగరావు, ప్రిన్సిపాల్ జరజాపు సతీష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.చిట్టిరెడ్డి, ఐ.రాజేష్ కుమార్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

వైభవంగా దుర్గాలమ్మ మారువారం ఉత్సవాలు

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ మారు వారం ఉత్సవాలు మంగళవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 13 వరకు పండగ నిర్వహించిన విషయం తెలిసిందే. పండగ ముగిసి వారం రోజులు పూర్తయిన సందర్భంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న బంగారమ్మ ఆలయానికి పరిసర గ్రామాల భక్తులు మంగళవారం సాయంత్రం మేళ తాళాలు, సాము గరిడీలతో చేరుకుని అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించి, భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అక్కడి నుంచి గ్రామంలోని రచ్చబండ వద్దకు చేరుకుని ఉయ్యాల కంబాల నిర్వహించారు. రాత్రి గ్రామ వీధుల్లో అమ్మవారిని భారీ ఊరేగింపుతో జాతర గట్టుపై ఆలయానికి చేర్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అందరి సహకారంతోనే పాలిథిన్ నిర్మూలన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: పాలిథిన్ కవర్ల వినియోగం పూర్తి స్థాయిలో నివారించాలని, అందుకు వ్యాపారులు, వినియోగదారులు పూర్తిగా సహకరించాలని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము కోరారు. జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురం, కాపులుప్పాడలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గుడ్డ, నార సంచులను వాడుకోవాలని సూచించారు. వ్యాపారులు పూర్తి స్థాయిలో పాలిథిన్ కవర్ల వినియోగం నిలిపివేయాలని, లేకుంటే భారీ జరిమానాలు విధించడంతోపాటు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని, అందువల్ల చెత్తను రోడ్లపై వేయకుండా క్లాప్ వాహనాలకే అందించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మి నాయుడు, సూపర్‌వైజర్లు బడే అమ్మోరు, పైడిరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి
9912220753
Office mail : sakshiadvtvsp@gmail.com